క్లుప్తంగా

లైసెన్స్‌డ్ సర్వేయర్స్

డివిజన్ పరిధిలో సెక్షన్ 163 అమలు

ఖలీల్‌వాడి: ఈ నెల 27న జరిగే లైసెన్స్ సర్వేయర్స్ థియరీ, ఫ్లోటింగ్ పరీక్షలకు నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలులో ఉంటుందని సీపీ సాయి చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు థియరీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫ్లోటింగ్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా నిషేధిత ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు కేంద్రాల వద్ద గుమిగూడరాదన్నారు.

డిప్యూటీ కమిషనర్ రవిబాబుకు రెవెన్యూ బాధ్యతలు

నిజామాబాద్ సిటీ : మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఎం.రవిబాబుకు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ రెవెన్యూ బాధ్యతలు అప్పగించారు. జూన్ 24న డీసీగా బాధ్యతలు తీసుకున్న రవిబాబుకు ముందుగా ఇన్‌చార్జి ఎంహెచ్‌వోగా పారిశుధ్య పనులు అప్పగించారు. రెవెన్యూ పనులు నిర్వహిస్తున్న జయకుమార్ సీడీఎంఏకు వెళ్లడంతో రెవెన్యూ విభాగం ఖాళీ అయ్యింది. దాంతో ఇన్‌చార్జి ఎంహెచ్‌వోతో పాటు రెవెన్యూ పనులను కూడా రవిబాబుకు అప్పగించారు. పలు చోట్ల పనులు చేస్తున్న వీఆర్‌వోలను డీసీ రవిబాబు బల్దియాకు పిలిపించారు. 50 మంది సిబ్బంది విధులు సరిగ్గా నిర్వహించడం లేదని నిర్ధారించారు. వారందరినీ బల్దియాలో కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. పీహెచ్ వర్కర్లుగా ఉన్నవారు కూడా గార్డెన్‌లలో, జోన్ కార్యాలయాల్లో ఉంటూ ప్రత్యేక విధులు నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరినీ రెండు బృందాలుగా ప్రత్యేక పనులు అప్పగించనున్నట్లు తెలిసింది.

ఘనంగా రుద్రహోమం



నిజామాబాద్ రూరల్: నగరంలోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామివారి కల్యాణం, రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీరామ్ రవీందర్,ఆలయ పురోహితులు, సిబ్బంది ,భక్తులు, తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలని సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మచ్చేందర్ బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కలిసి విన్నవించారు వెంటనే స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారం సత్వరమే చేపడతామన్నారు. సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు సునీల్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మాణిక్యం వెంకట్రాజ్యం తదితరులు ఉన్నారు.

బీఎంఎస్ జెండా ఆవిష్కరణ

నిజామాబాద్‌నాగారం: భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మార్వాడి గల్లీలోగల కార్యాలయంలో బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం ఇందూరు జిల్లా శాఖ అధ్యక్షులు కె.గోవిందు, తదితరులున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	100,500	వెండి(కిలో)	1,21,000
22 క్యారెట్స్	92,777	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	60	100
బీరకాయ	20	40	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	50	80	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	30	50
కొత్తిమీర	15	30	చిక్కుడుకాయ	40	70
పుదీనా	60	90	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	50	90			

-సుభాష్‌నగర్

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- రూరల్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ సవాల్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లతో బహిరంగ చర్చకు తాను సిద్ధమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ పటేల్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఏం అభివృద్ధి చేశారో డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంపై చర్చకు రావాలని తెలిపారు. డిచ్‌పల్లిలోని ఎస్ఎల్‌జీ గార్డెన్స్‌లో బుధవారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై బీజేపీ మండల కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిపై తన కు వ్యక్తిగతం కోపం లేదన్నారు. వర్షాలు కురవక నారు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే, నిజాంసాగర్ కాలువ ద్వారా నీటి విడుదలను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల గురించి ఎప్పుడూ మాట్లాడే మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు నోరు మెదపడం లేదన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి సైతం నీటి విడుదలపై మాట్లాడక పోవ డం సిగ్గుచేటన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీ పై బీజేపీ జెండా ఎగురడం ఖాయమన్నా రు. అనంతరం నిజాంసాగర్ కాలువ ద్వారా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డిచ్‌పల్లి-నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.పార్టీ పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న,బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పా నుగంటి సతీశ్‌రెడ్డి,పార్టీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్యాంరావు, మండల ప్రభారీ సంతోష్, నాయకులు సురేశ్, రవి గౌడ్, రమణ, బాలన్న, సుదర్శన్, విఠల్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, వినోద్, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



డిచ్‌పల్లి మోడల్ స్కూల్/కాలేజ్ వద్ద నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



సిరికొండ మోడల్ స్కూల్ వద్ద .. పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి/సిరికొండ : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ డిచ్‌పల్లి, సిరికొండ మండలాల్లో విజయవంతమైంది. డిచ్‌పల్లి మోడల్ స్కూల్/కళాశాల తరగతులు బంద్ చేయించిన అనంతరం ఎస్ఎస్ఐ తెలంగాణ యూనివర్సిటీ కార్యదర్శి జంగిలి శివ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడం సిగ్గు చేటన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, జిల్లా నాయకులు విశాల్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు సిరికొండలోని మోడల్ స్కూల్‌ను, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను, కొండాపూర్, తూంపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లను బంద్ చేయించారు. పీడీఎస్‌యూ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు జీషన్, ఉపాధ్యక్షులు నాగేంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

డిచ్‌పల్లి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖ కు ప్రత్యేక మంత్రిని నియమించాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు వరుణ్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం డిచ్‌పల్లి మండలం లోని నడిపల్లి, ఘన్‌పూర్, డిచ్‌పల్లి మండల కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పీడీఎస్‌యూ నాయకులు శ్రీకర్, హరికేశవ, దాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1990–91 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మోటాటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. 34 సంవత్సరాల తర్వాత విద్యార్థులందరూ ఒకే వేదికను పంచుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ చెమర్చిన కళ్లు.. చెదరని జ్ఞాపకాలు.. చిలిపి చేష్టలు.. అల్లరి పనులను గుర్తుచేసుకున్నారు. జిల్లా కళాకారుడు బండోజి సతీష్ తన వ్యాఖ్యానంతో గురువులు, పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని రక్తి కట్టించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. దేవర గంగాధర్ అమెరికా నుంచి ప్రత్యేకంగా కార్యక్రమానికి రావడంతో పూర్వ విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తంచేశారు.

విద్యార్థులు తమ కుటుంబ సమేతంగా హాజరై రోజంతా ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థులు సందగిరి విక్రమ్‌రెడ్డి, కోరట్‌పల్లి నర్సారెడ్డి, దేవర గంగాధర్, సిర్నాపల్లి భాస్కర్, సిర్నాపల్లి సాయిరెడ్డి, సదాసింగ్, మల్లెపూల నవీన్, గంగారాం, ముత్యాల భాస్కర్, బున్నె రాములు, తదితరులున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై పోరాటం



సుభాష్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పవర్‌హౌజ్ సమావేశపు హాల్‌లో అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థలో ఐక్య ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. కంపెనీ కార్యదర్శి బి సుదర్శన్ మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా పని చేస్తూ సంస్థను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బి చెన్నయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కంపెనీ అధ్యక్షుడు మన్నె శ్రీరాం, అసోసియేషన్ కార్యదర్శి కె బాల్‌చందర్, అన్ని డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు వసంత్ రా వు, రాంచందర్,ఎంఆర్‌టీశంకర్,లచ్చయ్య,వెంకటేశ్వర్,స్వామి,రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో ఆరోగ్య కార్డు ట్రయల్ రన్ సర్వే



సుద్దపల్లి లో ఆరోగ్యకార్డు ట్రయల్ రన్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జారీ చేయనున్న ఆరోగ్య కార్డు ట్రయల్ రన్ సర్వే ను ఇందల్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తర్ణాధికారి వై.శంకర్ మాట్లాడుతూ.. ఈ సర్వేలో అసంక్రమిత వ్యాధులైన హైపర్ టెన్షన్, డయాబెటిక్, క్యాన్సర్, పాల్యేటివ్ కేర్ లాంటి వ్యాధులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించినట్లు తెలిపారు. అలాగే ఇంటింటికి తిరిగి 30 సంవత్సరములు దాటిన ప్రతి ఒక్కరికి వివిధ పరీక్షలు నిర్వహించామన్నారు.ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాలం, ఎంఎల్‌హెచ్‌పీ లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజామాబాద్ సిటీ : జిల్లాకేంద్రంలోని నాగారం టైలర్స్ కాలనీలో స్థానిక సమస్యను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి సుజాత కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి సమస్యలు వివరించారు. కాలనీలో మురికి కాలువల నిర్మించడం లేదని, మురికి నీళ్ల నిలువ ఉండడంతో విష జ్వరాలు ప్రబలి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. లతా, జ్యోతి, భూలక్ష్మి, రుకుంబాయ్‌లున్నారు.

దేశభక్తి భావనను పెంపొందించిన తిలక్



తిలక్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న న్యాయవాద పరిషత్ సభ్యులు



గుండారం పాఠశాలలో ..

నిజామాబాద్ లీగల్: స్వాతంత్ర సమరయోధుడు బాల గంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తిలక్ గార్డెన్ లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో బాలగంగాధర్ తిలక్ దేశభక్తి భావనను పెంపొందించాడన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్వహించాడన్నారు. సామూహిక గణేష్ ఉత్సవాలు నిర్వహించరన్నారు. కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, నారాయణదాసు, వసంతరావు, కోటేశ్వరరావు, కేశవరావు, భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: నగరంలోని దుబ్బలో బాల గంగాధర్ తిలక్ జయంతిని బుధవారం తిలక్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం, పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం బాల గంగాధర్ తిలక్ హిందువుల ఐక్యత కోసం చేసిన కృషిని కొనియాడారు. తిలక్ యూత్ అధ్యక్షుడు తొందూరు శ్రీనివాస్, నాయకులు గంట భీమన్న, సత్యనారాయణ, సాయిరెడ్డి, కృపాకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలం గుండారం ఉన్నత పాఠశాలలో తిలక్, ఆజాద్‌ల జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గుండారం పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీపాద మాట్లాడారు.పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దాశరథి సాహిత్య వారసత్వాన్ని కొనసాగించాలి



దేవేందర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్ రూరల్: దాశరథి కృష్ణమాచార్య సాహిత్య వారసత్వాన్ని కవులు కొనసాగించాలని రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. మంగళవారం రాత్రి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవ సభలో ఆయన మాట్లాడారు. కవి సమ్మేళనంలో 'బొగ్గు ముక్క రాసిన ప్రేమ లేఖ' అనే కవితను వినిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఘనపురం దేవేందర్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహాకవి దాశరథి తనయుడు దాశరథి లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్ట్ కే శ్రీనివాస్, తెలంగాణ రచయిత సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, ప్రముఖ కవి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, డాక్టర్ వజ్జల శివకుమార్, రామోజు హరగోపాల్, డాక్టర్ కాంచనపల్లి, రంగు నవీనాచారి, మౌనశ్రీ మల్లిక్, ఒద్దిరాజు ప్రవీణ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు మండలానికి సాగు నీరందించే ప్యాకేజీ 20, 21 పనుల గురించి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, నిరంతరం భారీ నీటి పారుదల శాఖ మంత్రిచే పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. త్వరలోనే పనులు మొదలవుతాయని తెలిపారు. కొండాపూర్ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని మీఎంపీతో మాట్లాడి చేయించాలని సూచించారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పసలేని ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. డీసీసీ కార్యదర్శులు ఎర్రన్న, చందర్‌నాయక్, దేగాం సాయన్న, నర్సారెడ్డి, రాజారెడ్డి, మల్లేష్, డీలర్ రమేష్, జయరాం, ప్రవీణ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

తడి చెత్త-పొడి చెత్తపై అవగాహన



నిజామాబాద్ సిటీ : తడిచెత్త-పొడిచెత్తపై డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు, ఆర్పీలకు అవగాహన కల్పించారు. బుధవారం నగరశివారులోని డంపింగ్‌యార్డులో మెప్మా బృందం పరిశీలించింది. డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రభుదాస్ మహిళలకు చెత్త సేకరణ, చెత్తను తరలించే అంశంపై అవగాహన కల్పించారు. బయో వేస్టేజీ ప్లాంట్, వ్యర్థపదార్థాల శుద్ధీకరణ పద్ధతిని వివరించారు. మెప్మా సీవోలు అశోక్ కుమార్, సంతోష్‌కుమార్‌లతోపాటు ఆర్పిలు,డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి ప్రభుదాస్, జవాన్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సిరికొండ: ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు యం బాలయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ రవీందర్‌రావు కు వినతి పత్రం బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు మూడు దశల్లో భాగంగా తహసీల్దార్‌లకు వినతి పత్రం అందజేశామని, ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో ధర్నా, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత లేని డీఈవోలను తొలగించాలని డిమాండ్ చేశారు. యుఎస్‌పీసీ మండల నాయకులు రవి ఉన్నారు.

సంక్షిప్తం

నేడు కలెక్టరేట్ ఎదుట కిసాన్ మోర్చా ధర్నా

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నగరంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాటుకూరి తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిసాన్ మోర్చా జిల్లా ఇన్‌చార్జి పి గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, రాష్ట్ర బాధ్యులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల కిసాన్ మోర్చా అధ్యక్షులతోపాటు పదాధికారులు, రైతులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరుపతిరెడ్డి కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి: ధర్పల్లి మోడల్ స్కూల్లో 9,10వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు గంటల ప్రతిపాదికన బోధించుటకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీ బీఎడ్ అర్హత కలిగి ఉండాలని సూచించారు. ఈనెల 26న అభ్యర్థులు ధ్రువ పత్రాలతో డెమో క్లాసు కు హాజరుకావాలని ప్రిన్సిపల్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపు తున్న 29 మందిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాలకు సీఐ పీ ప్రసాద్ బుధవారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపర్చారు.సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ 23 మందికి రూ.30 వేలు జరిమానా విధించి, ఆరుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

మరో ఇద్దరికి..

నగరంలోని ఒకటో టౌన్ పరిధిలో పాముల బస్తీకి చెందిన శివకుమార్, ఆరో టౌన్ పరిధిలో అర్సపల్లికి చెందిన నవరాజ్ సునీల్ డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పట్టుబడినట్లు ఎస్‌హెచ్‌వోలు రఘుపతి, వెంకట్రావు తెలిపారు. ఇద్దరినీ మేజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చగా రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లుకు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు బుధవారం పదోన్నతులు కల్పించారు. జనరల్ మెడిసిన్‌లో డాక్టర్ ట్రాంస్ జాడే ఆదిలాబాద్ రిమ్స్‌కు, ఆర్తో విభాగంలో డాక్టర్ ప్రేమానందంకు నిర్మల్ మెడికల్ కళాశాలకు, గైనిక్‌లో డాక్టర్ ఉమాకు ఇక్కడే పదోన్నతి కల్పించారు.

సేవ కార్యక్రమాలపై అవగాహన

నిజామాబాద్ నాగారం: ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు సేవా కార్యక్రమాలు - సామాజిక బాధ్యత కలిగించేలా అవగాహన కల్పిస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు మద్దుకూరి సాయిబాబు తెలిపారు. విద్యార్థులకు సామాజిక బాధ్యత, సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించటంతో మంచి మార్గంలో వారు పయనిస్తారని పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మోపాల్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జడ్ సుస్మిత సూచించారు. బుధవారం మండలంలోని కంజర్‌శివారులోగల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా వడ్డెరకాలనీ, మోపాల్‌లో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బ్యాంకులు, లాటరీలు, ఏజెంట్ల పేరుతో ఎవరైనా ఓటీపీ అడిగితే చెప్పవద్దని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. ఏఎస్ఐ పరుశరాం, కానిస్టేబుళ్లు, సిబ్బంది ఉన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

నిజామాబాద్ నాగారం: పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థుల చదువులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఇందూరు కన్వీనర్ వంజరి బాలకృష్ణ, దుర్గాదాస్, మహేశ్, ప్రణీత్, యోగేష్, ప్రమ్, సిద్ధు తదితరులున్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

నిజామాబాద్ రూరల్ : రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగాస్థాన్‌లో పృథ్వీ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హెల్త్ డిపార్టమెంట్‌లో పారామెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న రూప పవర్ పృథ్వీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తోంది. ఈనెల 19న హైదరాబాద్‌లో బంధువుల ఇంట్లో బోనాల పండుగకు తన ఇంటికి తాళం వేసి వెళ్లింది.ఈ నెల 22న ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి.రూ.20వేలు, 8 గ్రాములు బంగారం నల్లపూసల దండ చోరీకి గురైనట్లు బాధితురాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఈనెల 31న టీయూసీఐ ఆధ్వర్యంలో ధర్నా

నిజామాబాద్ సిటీ : అసంఘటితరంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ముస్కె సుధాకర్ తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లిలోని శ్రామిక భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ముస్కె సుధాకర్ మాట్లాడుతూ... తెలంగాణలో సంఘటిత, అసంఘటిత కార్మికులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో నరేందర్, వెంకన్న, రాజేశ్వర్, బి.మల్లేష్, సాయరెడ్డి, మురళి, లింగం, రవికుమార్, రెహనా, గంగన్న పాల్గొన్నారు.

గడ్కోల్‌లో నీటి తిప్పలు



వాటర్ ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఎస్సీ కాలనీలో నీటి కష్టాలు నెలకొన్నాయి. రక్షిత మంచి నీటి పథకం ట్యాంకు ద్వారా తగినన్ని నీళ్లు రాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ట్యాంకు గేట్ వాల్వ్ చెడిపోవడంతో ట్యాంకులో నీరు నిల్వ ఉండటం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నల్లాల ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నల్లాల ద్వారా నీటిని సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.